సుఫల అక్షరం
www.aksharamtelugudaily.com
సామాన్యుడి అస్త్రం తెలుగు దినపత్రిక
అనుబంధ సంచిక
శనివారం 15, జూన్ 2024 పేజీలు : 5

# భూసేకరణ ప్రక్రియ వేగవంతం చేయాలి

■ జిల్లా కలెక్టర్ వి.పి. గౌతమ్




ఖమ్మం/ తల్లాడ (అక్షరంన్యూస్): జిల్లాలో చేపడుతున్న వివిధ ప్రాజెక్టులకు సంబంధించి భూసేకరణ ప్రక్రియ వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ వి.పి. గౌతమ్ అన్నారు. శుక్రవారం కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో జిల్లాలో చేపట్టిన రైల్వే, జాతీయ రహదారులు, నీటి పారుదల ప్రాజెక్టుల భూసేకరణ పురోగతిపై అధికారులతో, కలెక్టర్ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రాజెక్టులకు మిగతా2 లో..

# పదవుల కోసం క్యాడర్ వెయిటింగ్..

- ఎప్పుడు భర్తీ చేస్తారో ?
- నామినేటెడ్ ఆశలు....
- త్వరలో భర్తీ చేస్తారనే సంకేతాలు...
- జిల్లాలో భారీగా ఆశావహులు
- కీలక నాయకుల వైపే అందరిచూపు..

4లో..






కాంగ్రెస్ నాయకుల్లో నామినేటెడ్ పదవులపై ఆశలు రేకెత్తుతున్నాయి. సీఎం రేవంత్‌రెడ్డి వీలైనంత త్వరగా ఈ పదవులు భర్తీ చేస్తారనే సంకేతాలతో ఆశావహులలో సందడి మొదలైంది. అసెంబ్లీ ఎన్నికల సమయం లో ఎమ్మెల్యే సీట్లకు చివరి వరకు పోటీపడ్డ నాయ కులు, పార్టీ అధికారం లో లేకపోయినా దశాబ్ద కాలంగా జిల్లాల్లో, మండల స్థాయి లో, గ్రామ స్థాయి లో పార్టీకి విధేయులుగా ఉన్న నాయ కులు, ఎన్నికల సమయంలో ఇతర సందర్భాల్లో అధిష్ఠాన ముఖ్యుల నుంచి భరోసా పొందిన నాయకులు ఈ పదవులు తమకు దక్కుతాయనే విశ్వాసంతో ఉన్నారు.

● రాజన్న సిరిసిల్ల /ముస్తాబాద్ /(అక్షరం న్యూస్)

# లింగ నిర్ధారణ పరీక్షలు నిర్వహిస్తే కఠిన చర్యలు

జిల్లా కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్



మహబూబాబాద్ /గార్ల /అక్షరం న్యూస్: స్కానింగ్ సెంటర్లలో లింగ నిర్ధారణ పరీక్షలు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్ హెచ్చరించారు. శుక్రవారం జిల్లా కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాలులో జిల్లా కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్ స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ లెనిన్ వత్సల్ టొప్పో తో కలిసి జిల్లాస్థాయి మిగతా2 లో..

# రైతులకు అండగా ప్రభుత్వం

అకాల వర్షాల వల్ల పంట నష్టపోయిన రైతులకు ఎకరానికి 10 వేల రూపాయల పంట నష్టం అందించేందుకు అధికారులకు ఆదేశించిన వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు



ఖమ్మం /తల్లాడ (అక్షరంన్యూస్): ప్రభుత్వం రైతులకు అండగా నిలిచి చేయూతనందిస్తున్నదని రాష్ట్ర వ్యవసాయ, ఉద్యానవన, సహకార, మార్కెటింగ్, చేనేత శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. శుక్రవారం మంత్రి, జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో జిల్లా పరిషత్ చైర్మన్ లింగాల కమలరాజ్ అధ్యక్షతన జరిగిన జిల్లా పరిషత్ సాదారణ సర్వ సభ్య సమావేశంలో పాల్గొన్నారు. వ్యవసాయం, విద్య శాఖకు చెందిన అంశాల ఎజెండాగా ఈ సమావేశం జరిగింది. సమావేశంలో మంత్రి మాట్లాడుతూ, గతంలో ఎన్నడూ లేని విధంగా అకాల వర్షాల వల్ల పంట నష్టపోయిన రైతులకు ఎకరానికి 10 వేల రూపాయల పంట నష్టం అందించేందుకు ఆదేశాలు జారీచేయడం జరిగిందన్నారు. రైతులు ప్రకృతి కనుగుణంగా, వాతావరణ పరిస్థితుల మేరకు సాగు చేయాలన్నారు. ప్రభుత్వ పరంగా అన్ని సహాయ సహకారాలు అందించడం జరుగుతుందన్నారు. విత్తన కంపెనీలను ప్రతి నెల సమావేశ పరిచి తెలంగాణ రాష్ట్రంలో రైతులకు అవసరమైన విత్తనాలను అందించే విధంగా మిగతా2 లో..



# సామాన్యులకు అందుబాటులో ధరణి పోర్టల్

- రెవెన్యూ ప్రక్షాళనకు చర్యలు..
- గత ప్రభుత్వం తెచ్చిన ధరణితో లక్షలాది కుటుంబాలు ఛిన్నాభిన్నం రెవెన్యూ మంత్రి పొంగులేటి
- మంత్రి పొంగులేటితో సమావేశమైన ధరణి కమిటీ
- సిద్ధమవుతున్న ధరణి నివేదిక

ఖమ్మం/తల్లాడ (అక్షరంన్యూస్): గత బీఆర్ఎస్ ప్రభుత్వం తెచ్చిన ధరణి పోర్టల్ వల్ల రాష్ట్రవ్యాప్తంగా లక్షలాది కుటుంబాలు భూ సమస్యలను ఎదుర్కొంటున్నారని, ఎన్నో కుటుంబాలు ఛిన్నాభిన్నం అయ్యాయని రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌర సంబంధాలశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. పార్లమెంట్ ఎన్నికల ప్రక్రియ ముగిసిన తర్వాత స్వయంగా తాను ఖమ్మం జిల్లాలో క్షేత్ర స్థాయిలో మిగతా2 లో..

# పాఠశాలల్లో మౌలిక సదుపాయాలపై ప్రత్యేక శ్రద్ధ

స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ రాధిక గుప్త



హనుమకొండ/భీమదేవరపల్లి/(అక్షరం న్యూస్): ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాల కోసం ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నట్లు, అందుకోసం అదనపు నిధులు కేటాయించి ప్రభుత్వ పాఠశాలలను అభివృద్ధి చేస్తున్నట్లు స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ రాధిక గుప్త తెలిపారు. అమ్మ ఆదర్శ పాఠశాల పనుల్లో భాగంగా శుక్రవారం మండలంలో ఆమె పర్యటించారు. ఈ సందర్భంగా మండలంలోని ముల్కనూర్, కొప్పూర్, వంగర గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలలను పరిశీలించి, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల ఆధ్వర్యంలో మండలంలోని 20 పాఠశాలల్లో పూర్తయిన పనులపై సంతృప్తి వ్యక్తం చేశారు. అమ్మ ఆదర్శ పాఠశాల రెండో విడత పనులకు మండలంలోని ముల్కనూర్ మోడల్ స్కూల్, కేజీబీవీ కళాశాల, వంగర బాలికల గురుకుల విద్యాలయం ఎంపికైనట్లు స్పష్టం చేశారు. 2లో..

# జాతీయ నులిపురుగుల దినోత్సవం విజయవంతం చేయాలి

**- జిల్లా కలెక్టర్ అద్వైత్ కుమార్**



**మహబూబాబాద్/గార్ల /జూన్ 14/అక్షరం న్యూస్:** జాతీయ నులిపురుగుల దినోత్సవాన్ని విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ అద్వైత్ కుమార్ అన్నారు. మహబూబాబాద్ జిల్లా కలెక్టరేట్లోని కాన్ఫరెన్స్ సమావేశ మందిరంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ లెనిన్ వత్సల్ టొప్పో తో కలిసి జిల్లా వైద్య ఆరోగ్యశాఖ, విద్యాశాఖ, సంక్షేమ శాఖ అధికారులతో కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఈనెల 20వ తేదీన నిర్వహించనున్న జాతీయ నులిపురుగుల నిర్మూలన దినోత్సవాన్ని వైద్య ఆరోగ్య విద్యాశాఖ అధికారుల సమన్వయంతో పనిచేసి విజయవంతంగా నిర్వహించాలని అన్నారు. 20వ తేదీన ఏదైనా కారణాలతో మిగిలిపోయిన చిన్నారులకు 27వ తేదీన మాపప్ డే రోజున వేయించాలని సూచించారు. ఈ కార్యక్రమం లో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ బి. కళావతి భాయి మాట్లాడుతూ, 1-19 పిల్లలకు మాత్రలు వేయబడుతుందని, ఒక సంవత్సరం నుండి రెండు సంవత్సరాలలో పిల్లలకి సగం మాత్ర, రెండు నుంచి 19 సంవత్సరాలు పిల్లలందరికీ పూర్తి మాత్రగా డోస్ ఇవ్వబడుతుందని, ఇది నమిలి మింగాలని, ఎట్టి పరిస్థితుల్లో పిల్లలు మాత్రలను ఇంటికి తీసుకెళ్లకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్. పి డిప్యూటీ సీఈఓ నర్మద, జిల్లావైద్యారోగ్యశాఖ అధికారి డాక్టర్ బి కళావతి భాయి, డాక్టర్ అంబరీష్, డిప్యూటీ డిఎం హెచ్ ఓ, ప్రోగ్రామ్ ఆఫీసర్స్, జిల్లా వైద్య విద్యా సంక్షేమ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# డిగ్రీ ప్రవేశాలకు దరఖాస్తులు ప్రారంభం

**- ఐటీడీఏ పీవో ప్రతీక్ జైన్**



భద్రాద్రి కొత్తగూడెం/ భద్రాచలం /జూన్ 14/ అక్షరం న్యూస్ : 2024 - 25 విద్యా సంవత్సరం నకు గాను తెలంగాణ గిరిజన సంక్షేమ గురుకుల (బాలురు) డిగ్రీ కళాశాల మణుగూరు, మిట్టగూడెం యందు ప్రథమ సంవత్సరంలో ప్రవేశం పొందుటకు స్పాట్ అడ్మిషన్ల దరఖాస్తులు స్వీకరి స్తున్నట్లు ఐటిడిఏ ప్రాజెక్టు అధికారి ప్రతీక్ జైన్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 17 వ తేదీ నుండి 23 వ తేదీ వరకు ఇంటర్ ద్వితీయ సంవత్సరం ఉత్తీర్ణత సాధించిన విద్యార్థుల నుంచి ధృవీకరణ పత్రాలు నేరుగా కళాశాలలో సమర్పించాలని ఆయన అన్నారు. పైన తెలిపిన విధంగా దరఖాస్తు చేసుకున్న విద్యార్థులకు తదుపరి మెరిట్ జాబితా ఈనెల 25వ తేదీ నాడు ప్రకటించి కౌన్సిలింగ్ నిర్వహిస్తామని ఇతర వివరాల కొరకు 7901097698,7989243996 ఫోన్ నెంబర్లకు సంప్రదించాలని ఆయన కోరారు.

## సామాన్యులకు అందుబాటులో
# ధరణి పోర్టల్

(మొదటి పేజీ తరువాయి)

సంబంధించి, వాస్తవ అవసరం మేరకు భూసేకరణ చేపట్టాలన్నారు. మూడో రైల్వే లైన్ కు సంబంధించి, జిల్లాలో 59.17 హెక్టార్ల భూసేకరణ జరపాల్సివుండగా, 54.28 హెక్టార్లకు అవార్డ్ పాస్ చేసి, భూమిని స్వాధీనం చేసుకొని, రైల్వే లకు అప్పగించినట్లు తెలిపారు. మిగులు 4.11 హెక్టార్లకు గాను చర్యలు వేగవంతం చేసి, మూడో లైన్ పనులు వేగవంతం అయ్యేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. డోర్నకల్ జంక్షన్, భద్రాచలం రోడ్ జంక్షన్ ల మధ్య రైల్వే డబ్లింగ్ లైన్ ప్రాజెక్టుకు సంబంధించి సింగరేణి మండలం కమలాపురం, పోచారం, సింగరేణి, కారేపల్లి, కోమట్లగూడెం, రేలకాయలపల్లి గ్రామాల్లో 57.045 ఎకరాల భూసేకరణ కు గాను జెఎంఎస్ సర్వే ప్రక్రియ చేపట్టి, పిఎన్ పబ్లిష్ చేయాలన్నారు. రఘునాథపాలెం మండలం పాపటపల్లి, చింతకాని మండలం బస్వాపురం, నాగులవంచ, పాతర్లపాడు, ఎర్రుపాలెం మండలం ఎర్రుపాలెం వద్ద రైల్వే ఓవర్ బ్రిడ్జి నిర్మాణాలకు భూసేకరణ ప్రక్రియ పూర్తి చేసి, రైల్వే లకు అప్పగించాలన్నారు. ఖమ్మం-దేవరపల్లి గ్రీన్ ఫీల్డ్ నేషనల్ హైవే ప్యాకేజీ-1 కొరకు జిల్లాలో 548.08 ఎకరాల భూసేకరణ కు గాను, 507.2925 ఎకరాలకు అవార్డ్ పాస్ కాగా, రూ. 144.84 కోట్లు భూమి కోల్పోయిన రైతుల ఖాతాలకు జమచేసినట్లు ఆయన అన్నారు. ఇంకనూ 40.1875 ఎకరాలకు సంబంధించి భూసేకరణ ప్రక్రియ త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. ఇదే ప్రాజెక్ట్ ప్యాకేజీ-2 క్రింద 424.19 ఎకరాల భూసేకరణ అవసరం కాగా, 407.0450 ఎకరాలకు అవార్డ్ పాస్ చేసి, ఇప్పటివరకు రూ. 98.34 కోట్లు పరిహారం చెల్లించినట్లు, ఇంకనూ 17.1450 ఎకరాల భూసేకరణ ప్రక్రియ పూర్తి చేయాల్సి ఉందన్నారు. ఖమ్మం- దేవరపల్లి గ్రీన్ ఫీల్డ్ నేషనల్ హైవే ప్యాకేజీ-3 క్రింద 383.3325 ఎకరాల భూసేకరణకు గాను 371.1200 ఎకరాలకు అవార్డ్ పాస్ చేసి, రైతుల ఖాతాలలో రూ. 88.94 కోట్ల పరిహారం జమచేశామన్నారు. మిగులు 12.2125 ఎకరాల భూసేకరణ త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. సీతారామ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్ట్ (పాలేరు లింక్ కెనాల్) క్రింద ఏన్కూరు, కామేపల్లి, సింగరేణి, తిరుమలాయపాలెం, కూసుమంచి మండలాల్లో 1717.34 ఎకరాల భూసేకరణ కుగాను, 1569.39 ఎకరాలకు అవార్డ్ పాస్ చేసి, ఇప్పటి వరకు భూ పరిహారం క్రింద రూ. 93.39 కోట్లు, నిర్మాణాల పరిహారం క్రింద రూ. 7.30 కోట్లు విడుదల అయినట్లు ఆయన తెలిపారు. సీతారామ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్ట్ (సత్తుపల్లి ట్రంక్ కెనాల్) క్రింద 330.15 ఎకరాల భూసేకరణ కు గాను 325.30 ఎకరాలకు అవార్డ్ పాస్ చేసి, రూ. 19.59 కోట్లు పరిహారం క్రింద ఇప్పటికే విడుదల చేసినట్లు ఆయన అన్నారు. ఏన్కూరు వద్ద 18 ఎల్ కెనాల్, బుగ్గవాగు ప్రాజెక్ట్ ల భూసేకరణ వేగవంతం చేయాలన్నారు. మున్నేరు రిటెనింగ్ వాల్ కొరకు 190.16 ఎకరాల భూసేకరణ ప్రక్రియ క్షేత్ర స్థాయి తనిఖీలు చేసి పూర్తి చేయాలన్నారు. జిల్లాలో ఆయిల్ పామ్ ఇండస్ట్రీ, రోడ్ల విస్తరణ, ఆర్ యుబి, గోడౌన్ల నిర్మాణం, సింగరేణి కాలరీస్ కంపెనీ కి సంబంధించి జేవీఆర్ ఓసిపి, కిష్టారం ఓసిపి ప్రాజెక్టులకు కావాల్సిన భూసేకరణ పనుల్లో వేగం పెంచి, జాయింట్ సర్వే లు పూర్తిచేసి ప్రక్రియ త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. ప్రాజెక్టుల పూర్తితో రవాణా, సాగునీటి వ్యవస్థ బలపడి, జిల్లా అభివృద్ధి పథంలో పయనిస్తోందని, అభివృద్ధి కి సహకరించాలని కలెక్టర్ అన్నారు. ఈ సమీక్షా సమావేశంలో అదనపు కలెక్టర్ డి. మధుసూదన్ నాయక్, ఆర్డీవోలు జి. గణేష్, ఎల్. రాజేందర్, సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ ఏడి శ్రీనివాసులు, మైనింగ్ ఏడి సాయినాథ్, జాతీయ రహదారుల, రోడ్లుభవనాల, ఇర్రిగేషన్, మునిసిపల్, రైల్వే శాఖల అధికారులు, జిల్లాలోని తహశీల్దార్లు పాల్గొన్నారు.

## పాఠశాలల్లో మౌలిక సదుపాయాలపై ప్రత్యేక శ్రద్ధ

(మొదటి పేజీ తరువాయి)

ఈ పాఠశాలల్లో విద్యార్థులకు మెరుగైన వసతుల కోసం అదనపు నిధులు మంజూరు చేసి పనులు త్వరగా పూర్తిచేయాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. అనంతరం ముల్కనూర్ ఎస్సీ కాలనీ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు యూనిఫామ్ లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో భీమదేవరపల్లి మండల స్పెషల్ ఆఫీసర్,అడిషనల్ డిఆర్డిఓ శ్రీనివాసరావు, పంచాయతీరాజ్ డిఈ సాంబశివరెడ్డి, ఎంపీడీవో వీరేశం, ఎంఈఓ వెంకటేశ్వర్లు, పంచాయతీ కార్యదర్శులు జంగం పూర్ణచందర్, గుడికందుల మధు, ధర్మేందర్ తదితరులు పాల్గొన్నారు.

## రైతులకు అండగా ప్రభుత్వం

(మొదటి పేజీ తరువాయి)

సమాయత్తం చేయడం జరిగిందన్నారు. రైతులు ఆథరైజ్డ్ డీలర్ల వద్ద మాత్రమే విత్తనాలను కొనుగోలు చేయాలన్నారు. దళారులను ఆశ్రయించి నకిలీ విత్తనాలను కొనుగోలు చేయరాదన్నారు. విత్తనాల విషయంలో రాజీపడి మోసపోవద్దన్నారు. రైతు భరోసా కార్యక్రమానికి సంబంధించి రైతు సంఘాలు, ప్రజాప్రతినిధులతో చర్చించి విధి విధానాలు రూపొందించడం జరుగుతుందన్నారు. రైతులకు 7 వేల 5 వందల కోట్లు రైతుబంధు క్రింద అందించడం జరిగిందన్నారు. ఇతర దేశాల వ్యవసాయ శాస్త్రవేత్తలతో సమావేశమై ఎక్కువ దిగుబడి అందించే విత్తనాలను అందించే విధంగా కొరకు జరిగిందన్నారు. జిల్లాలో ఈ సంవత్సరం నుండే గోదావరి జలాలను పారించేందుకు నిర్దిష్టమైన సమయంలో జూలూరుపాడు, పాలేరు, యాతాలకుంట వద్ద టన్నెల్స్ పూర్తి చేసి సత్తుపల్లి ప్రాంతానికి, అశ్వరావుపేట, దమ్మపేట మండలాలకు, టన్నెల్స్ అవసరం లేని ప్రాంతాల్లైన వైరా, లంకాసాగర్ లకు నాగార్జున సాగర్ ప్రాజెక్టు ద్వారా నీళ్లందించేందుకు శక్తివంచన లేకుండా పనిచేయడం జరుగుతుందన్నారు. విద్యా సంవత్సరం ప్రారంభమైనందున ప్రభుత్వ పాఠశాలల్లో అన్ని మౌలిక వసతులు కల్పించడం జరిగిందన్నారు. విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, ఏకరూప దుస్తులు అందించామన్నారు. ప్రయివేటు కార్పోరేటు పాఠశాల లకు ధీటుగా మెరుగైన విద్యను అందించేందుకు ఉపాధ్యాయులను నియమించే దుకు డిఎస్సీ నోటిఫికేషన్ ఇవ్వడం జరిగిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం విద్య, వైద్యం, వ్యవసాయానికి అధిక ప్రాధాన్యతనిస్తుందని మంత్రి తెలిపారు. ఈ సమా వేశంలో జిల్లా పరిషత్ చైర్మన్ లింగాల కమలరాజు మాట్లాడుతూ, రైతు డిమాండ్ మేర విత్తనాలు అం దించాలన్నారు. అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాల కల్పన చేయాల న్నారు. ఈ సమా వేశంలో స్థానిక సంస్థల అదన పు కలెక్టర్ బి. సత్యప్రసాద్, డిసిసిబి చైర్మన్ దొండ పాటి వెంకటేశ్వరరావు, జిల్లా పరిషత్ సీ.ఈ.ఓ. ఎస్. వినోద్, జడ్పీటీసిలు, ఎం.పి.పి.లు, ప్రజా ప్రతినిధులు, జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## సామాన్యులకు అందుబాటులో ధరణి పోర్టల్

(మొదటి పేజీ తరువాయి)

పర్యటించినప్పుడు ప్రతి గ్రామంలో రెండు వందల కుటుంబాలకు పైగా భూ సంబంధిత సమస్యలను ఎదుర్కొంటున్న విషయం తన దృష్టికి వచ్చిందన్నారు. ఈ సమస్యల నుంచి ఉపశమనం కలిగించడానికి ధరణి పోర్టల్ ను పునర్ వ్యవస్థీకరించి భూ సంబంధిత వ్యవహారాలను అందుకు సంబంధించిన చట్టాలలో మార్పులు తేవాల్సిన అవసరం ఏర్పడిందని ఈ దిశగా ఇప్పటికే అవసరమైన చర్యలు చేపట్టామని వెల్లడించారు. శుక్రవారం నాడు డా.బీ.ఆర్.అంబేద్కర్ సచివాలయంలోని తన కార్యాలయంలో మంత్రి శ్రీనివాస్ రెడ్డి ధరణి కమిటీ సభ్యులు ఎం. కోదండ రెడ్డి, ఎం.సునిల్ కుమార్, మధుసూదన్ లతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడు తూ... గత ప్రభుత్వం ఎంతో హడావిడిగా ఎలాంటి అధ్యయనం చేయకుండా తీసుకువచ్చిన ధరణి పోర్టల్ కారణంగా ప్రజలు ఎన్నో సమస్యలు ఎదుర్కొన్నారని, ఈ సమస్యలను పరిష్కరించేందుకు తమ ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యతను ఇస్తోందని అన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు రెవెన్యూ వ్యవస్థ (ధరణి) ప్రక్షాళన చేసేందుకు సత్వర చర్యలు తీసుకుంటున్నామని, ధరణి పోర్టల్ అమలు కారణంగా వచ్చిన సమస్యలను అధ్యయనం చేయడానికి అయిదుగురు సభ్యులతో కమిటీని ఏర్పాటు చేశామని, ఈ కమిటీ చేసిన సిఫారసులపై ఈరోజు జరిగిన సమావేశంలో సుదీర్ఘంగా చర్చించామని, ఈ కమిటీ తుది నివేదిక ప్రభుత్వానికి సమర్పించేకంటే ముందు అన్నీ జిల్లా కలెక్టర్లతో సమావేశం నిర్వహించాలని నిర్ణయించినట్లు వెల్లడించారు. ఈ కమిటీ రాష్ట్రంలో భూ సంబంధిత నిపుణులు, అధికారులతో చర్చించడంతో పాటు 18 రాష్ట్రాలలోని యాక్ట్ ను క్షుణ్ణంగా పరిశీలించింది. భూమి వివాదాల పరిష్కారం కోసం రెవెన్యూ ట్రిబ్యునల్ లను ఏర్పాటు చేయాలని, భూమికి సంబంధించిన ముఖ్యమైన చట్టాలను కలిపి ఒకే చట్టంగా రూపొందించాలని కమిటీ సూచించిందని మంత్రి వెల్లడించారు. లోపభూయిష్టమైన 2020 %=శీ=% చట్టాన్ని తద్వారా రూపొందించిన ధరణి పోర్టల్ ను బలోపేతం చేయడంతో పాటు సామాన్య ప్రజలకు అందుబాటులో ఉండేలా అందరికీ సులువుగా అర్థమయ్యే రీతిలో ధరణి పోర్టల్ లో మార్పులు-చేర్పులు చేపట్టబో తున్నామని మంత్రి వెల్లడించారు. గత ప్రభుత్వం పార్ట్-బి లో ఉంచిన భూ సమస్యలను పరిష్కరించడానికి ఇప్పటికే స్పష్టమైన ఆదేశాలు జారీ చేయడం జరిగిందని, ఈ సమస్యల పరిష్కారానికి మరింత వేగంగా చర్యలు చేపట్టాలని సూచించారు.

## పదవుల కోసం క్యాడర్ వెయిటింగ్..

(మొదటి పేజీ తరువాయి)

**జిల్లాలో..**

జిల్లాలో గ్రంథాలయ సంస్థ చైర్మన్, డైరెక్టర్, జిల్లా రైతుబంధు సమితి, జిల్లాలో పలు మార్కెట్ కమిటీ చైర్మన్లు , డైరెక్టర్లు , ఆయా వ్యవసాయ సబ్? డివిజన్?ఆత్మ కమిటీ చైర్మన్, డైరెక్టర్, వివిధ ఆలయాల పాలక మండలి చైర్మన్లు , డైరెక్టర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. వీటితో పాటు పలు రాష్ట్రస్థాయి నామినేటెడ్? చైర్మన్?, డైరెక్టర్? పోస్టుల్లో కూడా అవకాశం ఉంటుంది

**ఎన్నికల్లో పనితీరు ఆధారంగా..**

లోక్ సభ ఎన్నికల్లో కాంగ్రెస్? నాయకుల పనితీరు, ఆయా ప్రాంతాల్లో పార్టీకి లభించిన ఓట్లను పరిగణనలోకి తీసుకుని నామినేటెడ్ పోస్టుల్లో ప్రాధాన్యం ఇవ్వనున్నట్లు తెలిసింది. ఆయా నామినేటెడ్? పోస్టులు ఆశిస్తున్న నాయకుల పనితీరును బేరీజు వేసి తదనుగుణంగా అవకాశాలు కల్పించనున్నట్లు సమాచారం. దీంతో ఎవరికి ఛాన్స్ దక్కుతుందనేది ఆసక్తి కరంగా మారింది.: పదవుల కోసం ఎమ్మెల్యేలు, పార్టీ కీలక నేతల చుట్టూ తిరుగుతూ తమను దృష్టిలో పెట్టుకోవాల్సిందిగా కోరుతున్నారు. కష్టపడి పనిచేసిన నేతలు స్థానిక సంస్థల్లో పోటీ చేయడంతో పాటు నామినేటెడ్ పదవుల కోసం ప్రయత్నాలను ముమ్మరం చేస్తున్నారు. ప్రస్తుతం రాజన్న సిరిసిల్ల జిల్లాలో 9 మార్కెట్ కమిటీలు ఉన్నాయి పోత్గల్, సిరిసిల్ల, వేములవాడ, ఇల్లంతకుంట, గంభీరావుపేట, రుద్రంగి, బొప్పాపూర్, బోయినపల్లితో వీర్నపల్లి లో మార్కెట్ కమిటీలు ఉన్నాయి. దీనితో పాటు గ్రామస్థాయి నుంచి ఆశావహులు. వారి స్థాయికి తగినట్లుగా పదవులు ఇవ్వాలని విన్నవిస్తున్నారు. గ్రామ, మండల స్థాయిలో ఉండే దేవాలయ కమిటీలు, మార్కెట్ కార్యవర్గాల్లో అవకాశాలు కల్పించాలని కోరుతున్నారు. రాబోయే స్థానిక ఎన్నికల్లో సర్పంచులు, ఎంపీటీసీలుగా జడ్పీటీసీలుగా పార్టీ మద్దతు ఇవ్వాలని ముందస్తుగా హామీలు పొందుతున్నారు. ప్రధానంగా జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ పదవి కోసం పోటీపడుతున్నారు .దింతో ఎవరికి ఛాన్స్ ధక్కుతుందనేది ఆసక్తి కరంగా మారింది.

## స్కానింగ్ సెంటర్లలో లింగ నిర్ధారణ పరీక్షలు నిర్వహిస్తే కఠిన చర్యలు

(మొదటి పేజీ తరువాయి)

మల్టీ మెంబర్ అప్రోపియేట్ అథారిటీ కమిటీ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో పాల్గొన్న కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని ప్రతి స్కానింగ్ సెంటర్ ను జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారులు తనిఖీ చేసి ఫారం- ఎఫ్ లు తప్పనిసరిగా చెక్ చేయాలని, యుక్త వయసులో ఉన్న యువత కు గర్భస్థ లింగ నిర్ధారణ నిషేధిత చట్టం గురించి అవగాహన కల్పించాలన్నారు. యుక్త వయసులో వచ్చే మార్పులపై అన్ని కళాశాలల్లో యువతకు అవగాహన కల్పించాలని సూచించారు. భ్రూణ హత్యలను నివారించి,బాలికల నిష్పత్తి పెరిగేటట్లు పోలీసు కళాజాత, స్వయం సహాయక సంఘాల, పౌరసంబంధాల శాఖ సాంస్కృతిక కళాకారుల ద్వారా అవగాహన కల్పించాలని అన్నారు. ఈ సమావేశంలో మహబూబాబాద్, తొర్రూరు ఆర్డీఓలు ఎల్.అలివేలు, నరసింహారావు,డి.ఎస్.పి.తిరుపతి రావు, జిల్లా వైద్యాధికారి డాక్టర్ కళావతి బాయి, డిప్యూటీ డి.ఎం.హెచ్.ఓ అంబరీష్, వైద్య విధాన పరిషత్ అధికారి డాక్టర్ వెంకట్ రాములు, ఇంచార్జి సూపరింటెండెంట్ డాక్టర్ జగదీశ్వర్, ప్రోగ్రా%శీ% అధికారి బిందుశ్రీ, ఇతర వైద్య అధికారులు పాల్గొన్నారు.

## అక్రమ ఇసుక రవాణా పై పోలీసు డేగ కన్ను



**భద్రాద్రి కొత్తగూడెం/ భద్రాచలం జూన్ 14/ అక్షరం న్యూస్ :** అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్న అక్రమార్కులపై పోలీసులు నిగాపించారు. శుక్రవారం ఆంధ్రప్రదేశ్ ఎట్టపాక మండలం గుండాల నుండి అక్రమంగా భద్రాచలం పట్టణానికి ఇసుకను తరలిస్తున్న డాక్టర్ ను పట్టణ ఎస్ఐ విజయలక్ష్మి అదుపులోకి తీసుకొని భద్రాచలం పట్టణ పోలీస్ తరలించారు. గత కొన్ని రోజుల నుండి గుండాల ఇసుక ర్యాంపు నుండి అర్ధరాత్రి వేళలో అనుమతి లేకుండా అక్రమంగా ఇసుకను తరలిస్తూ కాసులను గడిస్తున్న అక్రమార్కులపై పట్టణ ఎస్సై విజయలక్ష్మి ప్రత్యేక నిగా ఉంచి తెల్లవారుజామున ర్యాంపు వద్ద ఒక ట్రాక్టర్ ను డ్రైవర్ను అదుపులో తీసుకొని కేసు నమోదు చేశారు .అప్పటికే ఇంకొక ట్రాక్టర్ పోలీసులు వచ్చారన్న సమాచారంతో అక్కడి నుంచి పరార్ అయ్యారని తెలుస్తుంది.

## ప్రైవేటు పాఠశాలల్లో అధిక ఫీజులు నియంత్రించాలి

**- సిపిఐ ఎం భద్రాచలం పట్టణ కార్యదర్శి గడ్డం స్వామి**



**భద్రాద్రి కొత్తగూడెం/ భద్రాచలం/ జూన్ 14 /అక్షరం న్యూస్ :** ఏజెన్సీ కేంద్రమైన భద్రాచలం పట్టణంలో కార్పొరేట్ స్థాయిలో విద్యార్థుల నుండి ఫీజులు సులువు చేస్తున్న పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని సిపిఐఎం భద్రాచలం పట్టణ కార్యదర్శి గడ్డం స్వామి డిమాండ్ చేశారు. శుక్రవారం ప్రైవేటు విద్యా దోపిడి పై పాత్రికేయుల సమావేశంలో గడ్డం స్వామి మాట్లాడుతూ విద్యా హక్కు చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయాలని కోరారు. ప్రైవేటు పాఠశాలల్లో, కళాశాలలో ఫీజుల నియంత్రణ చట్టం తీసుకురావాలని డిమాండ్ చేశారు.అదేవిధంగా పట్టణంలో ప్రతి పాఠశాల ముందు ఫీజుల బోర్డులు ఏర్పాటు చేయాలని కోరారు. జూనియర్ కళాశాలలో మధ్యాహ్న భోజన పథకం అమలు అమలు చేయాలని .ప్రైవేటు పాఠశాలల్లో యూనిఫామ్, స్టేషనరీ, బుక్స్ అమ్మకాలను నియంత్రించాలని లేనిపక్షంలో సిపిఎం ఆధ్వర్యంలో పోరాటం చేస్తామని హెచ్చరించారు.అంతేకాకుండా పట్టణంలోని ప్రైవేటు పాఠశాలలలో క్వాలిఫైడ్ బిఈడి, టిటిసి, టెట్ ఉత్తీర్ణ చెందిన వారిని మాత్రమే బోధకులుగా నియమించి సకాలంలో వేతనాలు చెల్లించాలని అన్నారు.

## తెలంగాణలో మళ్లీ నారాయణ విద్యాసంస్థల దోపిడి షురూ

**అక్షరంన్యూస్, జవహర్ నగర్ :** తెలంగాణలో నారాయణ విద్యా సంస్థల దోపిడి కొనసాగుతుంది. ఇంటర్మీడియట్ అడ్మిషన్ల పేరుతో అత్యధిక ఫీజులు వసూలు చేస్తున్నారు. ఇంటర్ కోర్సులకు వివిధ రకాల ట్యాగ్లను జతచేస్తూ లక్షలాది రూపాయలు దండుకుంటున్నా ఇంటర్మీడియట్ బోర్డు అధికారులు నిమ్మకు నిరేత్తినట్లు వ్యవహరిస్తున్నాయని ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇంటర్ ప్రథమ ద్వితీయ సంవత్సరం విద్యార్థులు తమ కళాశాలలోనే పాఠ్యపుస్తకాలు తీసుకోవాలని విద్యార్థులపై ఒత్తిడి తీసుకువస్తున్నారు కళాశాలలో ప్రారంభించి పది రోజులు గడవకముందే 50 శాతం ఫీజు చెల్లించాలని తల్లిదండ్రులపై ఒత్తిడి తీసుకువస్తున్నారు.

కేవలం పది పాఠ్యపుస్తకాలకు పదివేల రూపాయలు వసూలు చేస్తున్న పట్టించుకునే నాధుడే కరువయ్యారని తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇంటర్మీడియట్ అడ్మిషన్ల, పాఠ్యపుస్తకాల పేరుతో దోచుకుంటున్న నారాయణ కళాశాల పై ఇంటర్ బోర్డు అధికారులు నిఘా ఏర్పాటు చేసి చర్యలు తీసుకోవాలని విద్యార్థుల తల్లిదండ్రులను కోరుతున్నారు.

# ఎమ్మెల్యే కృషితో విద్యుత్ సబ్ స్టేషన్ మంజూరు



**మహబూబాబాద్/కేసముద్రం/జూన్ 14/అక్షరం న్యూస్:** మహబూబాబాద్ ఎమ్మెల్యే డాక్టర్ భూక్య మురళి నాయక్ కృషితో కేసముద్రం మండల కేంద్రంలో నూతన విద్యుత్ సబ్ స్టేషన్ మంజూరు అయ్యింది.గత నాలుగు నెలల క్రితం కేసముద్రం మండల నాయకులు నూతన సబ్ స్టేషన్ ను మంజూరు చేయించాలని కోరగా ఎమ్మెల్యే మురళి నాయక్ దానికి స్పందించారు.కేసముద్రం మండలంలో 33/11 కెవి సబ్ స్టేషన్ మంజూరు కోసం డిప్యూటీ సీఎం బట్టి విక్రమార్కకు ప్రతిపాదనను సమర్పించారు.ఈ నూతన సబ్ స్టేషన్ వ్యవసాయ రంగానికి,స్థానిక రైతులకు చాలా ఉపయో గపడుతుందని తెలిపారు.కేసముద్రం మండలం దన్నసరి గ్రామంలో భూగర్భ రైల్వే క్రాసింగ్ కేబుల్ ద్వారా ఏర్పాటు చేసిన11 కెవీ ఫీడర్ గత కొన్నేళ్లుగా లో వోల్టేజీ సరఫరాలో హెచ్చుతగ్గులతో అంతరాయం కలిగిస్తుందని పేర్కొన్నారు.ఈ సమస్యల కారణంగా ప్రజలు విద్యుత్ సమస్యలతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని,కేసముద్రంలో కొత్త 33/11 కెవీ మంజూరు చేయాలని కోరారు.దీంతో సానుకూలంగా స్పందించిన డిప్యూటీ సీఎం కేసముద్రంలో కొత్త సబ్ స్టేషన్ ను మంజూరు చేశారు.ఈ క్రమంలో శుక్రవారం నాడు ఎమ్మెల్యే మురళి నాయక్ విద్యుత్,రె వెన్యూ అధికారులతో కలిసి స్థలాన్ని పరిశీలించారు . డిసిసి వైస్ ప్రెసిడెంట్ అంబటి మహేందర్ రెడ్డి,మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు అల్లం నాగేశ్వరరావు,బండారు వెంకన్న,కదిర సురేం దర్,వేముల శ్రీనివాసరెడ్డి,తరాల వీరేష్ యాదవ్, బనిశెట్టి వెంకన్న,రెవెన్యూ,విద్యుత్ అధికారులు పాల్గొన్నారు.

# కుల గణన చేసి రిజర్వేషన్ పెంచాలి

**- రాజన్న సిరిసిల్ల జాతీయ బీసి యువజన సంఘం జిల్లా ఇంచార్జ్ తోటకూరి శ్రీకాంత్**



**రాజన్న సిరిసిల్ల /ముస్తాబాద్ /జూన్ -14(అక్షరం న్యూస్ :** కుల గణనకు అనుకూలంగా బలహీన వర్గాల సరైన రిజర్వేషన్లు కల్పించాలని బిసి యువజన సంఘం జిల్లా ఇంచార్జ్ తోటకూరి శ్రీకాంత్ డిమాండ్ చేశారు నూతనంగా బీసీ యువజన సంఘం జిల్లా ఇంచార్జి గా పదవి బాధ్యతలు చెపట్టిన తరువాత శుక్రవారం ముస్తాబాద్ మండలం కొండాపూర్ గ్రామానికి రావడంతో బీసీ యువజన సంఘము ఆధ్వర్యంలో శాలువా కప్పి సన్మానం చేసి శుభాకాంక్షలు తెలిపారు..ఈ సందర్బంగా జాతీయ సీనియర్ నాయకుడు బీసీ జాతీయ కార్యదర్శి ఈడుగురాళ్ల సురేష్ గౌడ్ మాట్లాడుతూ జనాభా ప్రాతిపదికన బడుగులకు రాజ్యధికారంలో వాటా కల్పించాల్సిన అవసరం ఉందని ఈ దిశగా సమయం చేసే లక్ష్యంతో మరోసారి జిల్లా లో సమావేశం ఉంటుంది అని తెలిపారు. అనంతరం .శ్రీకాంత్ మాట్లాడుతూ నెలలో రెండు సార్లు సిరిసిల్ల కు వచ్చి సంఘం సమీక్ష సమావేశాలు, పలు కార్యక్రమాలు చేయడం జరుగుతుంది అని తెలిపారు ఇంచార్జ గా తన నియమానికి సహకరించిన జాతీయకార్యదర్శి ఈడుగురాల సురేష్ గౌడ్ జిల్లా అధ్యక్షుడు పాకాల శ్రీకాంత్ వెంకన్న శ్రావణ్ నాగారాజులకు కృతజ్ఞతలు తెలిపారు ఈ కార్యములో శ్రీకాంత్ వెంకన్న నరేష్ తదితరులు పాల్గొన్నారు.

# స్కూల్ బస్‌లను తప్పనిసరిగా కండిషన్‌లో ఉంచాలి..






**- వైరా మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ వరప్రసాద్ విస్తృత తనిఖీలు..**

**- బోనకల్ మండలంలో రెండు స్కూల్ బస్సులు సీజ్..**

**ఖమ్మం/ వైరా జూన్ 14 (అక్షరంన్యూస్):** జిల్లాలో పాఠశాలలు, కళాశాలలు ప్రారంభమైన్నందున స్కూల్ యాజమాన్యాలు పిల్లలను రవాణా చేసే బస్సులను తప్పనిసరిగా కండిషన్ లో ఉంచుకోవాలని వైరా మోటర్ వెహికల్ ఇన్స్పెక్టర్ వి. వరప్రసాద్ సూచించారు. శుక్రవారం ఖమ్మం జిల్లా బోనకల్ మండలంలో ఆయన స్కూళ్ళ, కాలేజీల బస్సులను తనిఖీలు చేపట్టారు. పాఠశాలలు ప్రారంభం కావడంతో విద్యార్థులను రవాణా చేసే స్కూల్ బస్సు లపై ఫోకస్ పెట్టారు. ఈ సందర్భంగా నిబంధనలు పాటించని స్కూలు బస్సులపై వేటు వేస్తున్నారు. ఈ నేపథ్యంలో. ఫిట్నెస్ , టాక్స్ లేకుండా నిబంధనలను పాటించని రెండు స్కూల్ బస్సులును సీజ్ చేశారు.

అనంతరం ఆయన మాట్లాడుతూ ఫిట్నెస్, ఇన్సూరెన్స్, పర్మిట్, డ్రైవర్ డ్రైవింగ్ లైసెన్స్, ఫయర్ సేఫ్టి కిట్, ఫస్ట ఎయిడ్ కిట్ అన్ని తప్పనిసరిగా ఉండాలని సూచించారు. ఎటువంటి అనుమతులు, పత్రాలు లేకుండా బస్సులను విచ్చలవిడిగా తిప్పితే చట్టపరంగా చర్యలు తీసుకోవడమే కాకుండా జరిమానాలు విధించడం జరుగుతుందని వెల్లడించారు. స్కూల్లు, కళాశాలల యాజమాన్యాలకు ఆయన క్షుణ్ణంగా అవగాహన కల్పించి తగు చర్యలు తీసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట పలువురు సిబ్బంది ఉన్నారు.

# బడిబాటలో చిన్నారులకు అక్షరాభ్యాసం

**- కార్పొరేటర్ హమీద్ పటేల్**

**శేరిలింగంపల్లి జూన్ 14 అక్షరం క్రైమ్ ప్రతినిధి :** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న, ప్రొఫెసర్ జయ శంకర్ బడి బాట కార్యక్రమంలో కొండాపూర్ డివిజన్ కార్పొరేటర్ హమీద్ పటేల్ పాల్గొనటం జరిగింది. కొండాపూర్ డివిజన్ కొత్తగూడలో గల ఏంపిపిఎస్ ప్రభుత్వ పాఠశాల నందు నిర్వహించిన ప్రొఫెసర్ జయ శంకర్ బడి బాట కార్యక్రమంలో పాల్గొని, పలువురు చిన్నారులకు పలక, బలపాలు, పెన్సిల్లు, పుస్తకాలు పంపిణి చేసి, మంచిగా చదివి, ఉన్నత స్థానాలకు చేరుకోవాలని కార్పొరేటర్ హమీద్ పటేల్ చిన్నారులను ఆశీర్వదించారు. ఈ సందర్భంగా పలువురు చిన్నారులకు అక్షరాభాష్యం చేయించి చిన్నారులచే అక్షరాలు దిద్దించి, ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ హమీద్ పటేల్ తో ఏంఈఓకే. వెంకటయ్య, ఏంయన్ఓ కే. రాములు, ఎల్ఎఫ్ఎల్ హెచ్ఎం



ఏం. నాగయ్య, మౌరి టెక్ ఫౌండేషన్ నిర్వాహకులు స్వర్ణ రెడ్డి, సీనియర్ నాయకులు ఆర్ జంగం గౌడ్, నీలం లక్ష్మి నారాయణ ముదిరాజ్, కేశం కుమార్ ముదిరాజ్, నీలం లక్ష్మణ్ ముదిరాజ్, మొహ్మద్ ఖాసీం, మొగుల స్వామి సాగర్ తదితరులు పాల్గొన్నారు.

## వృద్ధురాలి ఆత్మహత్య



**హనుమకొండ/భీమదేవర పల్లి/జూన్ 14 (అక్షరం న్యూస్):** హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం వంగర పోలీస్ స్టేషన్ పరిధిలో వృద్ధురాలు బావిలోకి దూకి ఆత్మహత్య చేసుకున్న ఘటన చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు మండలంలోని రంగయ్యపల్లి గ్రామానికి చెందిన సట్ల రామక్క (77) అనే వృద్ధురాలు గత కొంతకాలంగా లివర్ సంబంధిత వ్యాధితో హైదరాబాదులోని ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స తీసుకుంది. ఈ మేరకు గురువారం రాత్రి తీవ్రమైన కడుపునొప్పితో బాధపడుతూ ఇంటికి దగ్గరలో ఉన్న వ్యవసాయ బావిలోకి దూకి ఆత్మహత్య చేసుకుంది. మృతురాలి కూతురు నల్లగోని రమ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వెంకటేశ్వర్లు తెలిపారు.

# లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో పలకలు పంపిణీ

**జనగామ జిల్లా/ రఘునాథపల్లి/ (అక్షరం న్యూస్) జూన్ 14:** మండల కేంద్రంలోని స్థానిక ప్రైమరీ పాఠశాలలో సామూహిక అక్షరాభ్యాసం కార్యక్రమాన్ని పురస్కరించుకొని స్థానిక లయన్స్ క్లబ్ ఆఫ్ రఘునాథపల్లి స్టేషన్ సౌజన్యంతో పాఠశాలలో విద్యను అభ్యసిస్తున్న నర్సరీ ఎల్ కే జి,యూకేజీ విద్యార్థిని విద్యార్థులకు పలకలు,స్లేట్ పెన్సిల్ పంపిణీ చేయడం జరిగింది ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ అధ్యక్షులు శంకర్ రెడ్డి,కోశాధికారి ప్రదీప్ కుమార్, లయన్ సభ్యులు కందుల అనిల్ కుమార్, కడారి శ్రీనివాస్, ఎం డి రహీం,కోళ్ల రాజు, ఇమ్మడిశెట్టి కరుణాకర్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఉపాధ్యాయులు, పాల్గొన్నారు.



## ఎమ్మెల్యే కూనంనేనిని కలిసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన ఉర్దూఘర్ కమిటీ



**భద్రాద్రి జిల్లా/ కొత్తగూడెం/ జూన్.14 /అక్షరం న్యూస్:**

జూన్ 14న సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు జన్మదినం సందర్భంగా కొత్తగూడెం ఉర్దూఘర్ కమిటీ ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు ను కమిటీ సభ్యులు మర్యాదపూర్వకంగా కలుసుకుని శాలువా కప్పి ఘనంగా సన్మానించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కాంగ్రెస్ మైనార్టీ నాయకులు ఉర్దూఘర్ చైర్మన్ నయీమ్ ఖురేషి, ఉర్దూ ఘర్ సెక్రటరీ మహమ్మద్ షరీఫ్, జావీద్ సతే, ఏ.ఎస్.జె మాజీ అధ్యక్షులు అమీర్ ఖాద్రి, సీనియర్ అడ్వకేట్ ఎం.ఏ రజాక్, యకూబ్, బాబుజాని, పాషా , ఫరీద్ మహమ్మద్ సిరాజుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

## పదోన్నతి పొందిన గెజిటెడ్ హెచ్ఎంలు వీరే..

**జనగామ జిల్లా /రఘునాథపల్లి/( అక్షరం న్యూస్ ) జూన్ 14 :** గెజిటెడ్ హెచ్ఎంలుగా పదోన్నతి పొందిన తొమ్మిది మంది ప్రధానోపాధ్యాయులు పలు పాఠశాలల్లో విదుల్లో చేరారు. వారిలో ఖిలాషాపూర్ హెచ్ఎంగా డా భారత రవీందర్, భాంజీపేట హెచ్ఎంగా రాజాహన్మంతరెడ్డి, కంచనపల్లి హెచ్ఎంగా సత్యనారాయణ, మండలగూడెం హెచ్ఎంగా వృకోధర్, అశ్వరావుపల్లి హెచ్ఎంగా శోభన్ బాబు,గబ్బెట హెచ్ఎంగా ఇబ్రాహీం, ఇబ్రహీంపూర్ హెచ్ఎంగా శాంతికుమారి, మేకలగట్టు హెచ్ఎంగా సంపత్ కుమార్, కోమళ్ల హెచ్ఎంగా కె, నర్సింహులు భాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా అయా పాఠశాలల్లో విధుల్లో చేరిన గెజిటెడ్ హెచ్ఎంలను ఉపాధ్యాయులు శుభాకాంక్షలు తెలిపారు

## పోగొట్టుకున్న ఫోన్లు అందజేసిన ఎస్ఐ శ్రీకాంత్



**మద్నూర్ /జూన్ 14 (అక్షరం న్యూస్ - కామారెడ్డి ):** మద్నూర్ పోలీస్ స్టేషన్ కేంద్రంలో పోగొట్టుకున్న ఇద్దరి ఫోన్లు రికవరీ చేసి ఎస్. ఐ. శ్రీకాంత్ అందజేయడం జరిగింది. శుక్రవారం రోజున మద్నూర్ కేంద్రానికి చెందిన లక్ష్మణ్, జుక్కల్ మండలం పెద్ద గుల్ల గ్రామానికి చెందిన రామ్ దాస్ అనే ఇద్దరు వారి యొక్క ఫోన్లు పోగొట్టుకోవడం తో మద్నూర్ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయడం జరిగింది. ఎస్. ఐ. శ్రీకాంత్, డి. విట్టల్ పోలీస్ విభాగం సి.ఈ. ఐ. ఆర్. ద్వారా పోగొట్టుకున్న ఫోన్లను రికరి చేసి పోగొట్టుకున్న వారికి వారి యొక్క ఫోన్లను అందజేయడం జరిగింది. ఫోన్లను అందించడం తో లక్ష్మణ్, రామ్ దాస్ సిబ్బందికి ప్రత్యక ధన్యవాదములు తెలిపారు.

## అటకెక్కిన వీరన్న భూముల సర్వే

**- సర్వేపై దేవదాయ శాఖ అధికారుల అలసత్వం**
**- బిజెపి మండల అధ్యక్షుడు పైడిపల్లి పృథ్వీరాజ్**



**హనుమకొండ/ భీమదేవరపల్లి/ జూన్ 14(అక్షరం న్యూస్):** కొత్తకొండ వీరన్న భూముల సర్వే అటకెక్కిందని, సర్వేపై దేవాదాయశాఖ అధికారులు అలసత్వం ప్రదర్శిస్తున్నారని బిజెపి మండల అధ్యక్షుడు పైడిపల్లి పృథ్వీరాజ్ ఆరోపించారు. శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ వీరభద్ర స్వామి ఆలయ భూములు కాపాడడంలో దేవదాయశాఖ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని తీవ్రస్థాయిలో మండిపడ్డారు. దేవునికి వచ్చిన కానుకలు లెక్కబెట్టుకోవడంలో ఉన్న శ్రద్ధ, ఆలయానికి సంబంధించిన భూములను కాపాడడంలో లేదని విమర్శించారు. దేవుని భూములు కబ్జాకు గురవుతున్నట్లు తెలిసిన దేవదాయ శాఖ అధికారులు మాత్రం సర్వే చేపట్టడం లేదని అన్నారు. సర్వేపై జరుగుతున్న జాప్యం చూస్తుంటే ఆలయానికి చెందిన కొంతమంది వ్యక్తుల ప్రమేయంతోనే ఈ కబ్జాలు జరుగుతున్నాయని స్పష్టం చేశారు.త్వరలో దేవుని భూముల రక్షణ కోసం బిజెపి పార్టీ ఆధ్వర్యంలో ఆందోళన చేపడతామని హెచ్చరించారు.

## నేడు తల్లాడలో విద్యుత్‌కు అంతరాయం..

**- విద్యుత్ శాఖ అధికారి రాజేష్..**



**ఖమ్మం/ తల్లాడ జూన్ 14 (అక్షరంన్యూస్):** ఈనెల 15వ తేదీన తల్లాడ టౌన్ ఫీడర్ లో మరమ్మతుల దృష్ట్యా ఉదయం సమయం 8 గంటల నుండి మధ్యాహ్నం 1 గంటలవరకు విద్యుత్ సరఫరా నిలిపి వేయడం జరుగుతుందని తల్లాడ విద్యుత్ శాఖ అధికారి రాజేష్ విలేకరులకు తెలిపారు.

తల్లాడ, నారాయణపురం, మల్లారం గ్రామాలకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగునని వెల్లడించారు. అదేవిధంగా తల్లాడ విద్యుత్ సబ్స్టేషన్ లో మరమ్మతుల దృష్ట్యా ఉదయం సమయం 8 గంటల నుండి 10 గంటలవరకు విద్యుత్ సరఫరా నిలిపి వేయబడును . సబ్స్టేషన్ పరిధిలో గల అన్ని గ్రామాలకు పరిశ్రమలకు అంతరాయం కలుగుతోందని తెలిపారు. ప్రజలు సహకరించాలని కోరారు.

## ప్రపంచ రక్తదాన దినోత్సవం రక్త శిబిరంలో పాలుగొన్న సైదాపూర్ యువకులు



**కరీంనగర్/సైదాపూర్,జూన్14(అక్షరం న్యూస్):**

ప్రపంచ రక్త దాన దినోత్సవం సందర్భంగా హుజరాబాద్ గవర్నమెంట్ హాస్పిటల్ లో ఏర్పాటు రక్తదాన శిబిరంలో సైదాపూర్ మండల కేంద్రానికి చెందిన యువకులు బొనగిరి అనిల్ మాజీ ఐదవ వార్డు సభ్యుడు,వేముల సాయి కుమార్,దొంత సురేష్ లు పాల్గొనిరక్తదానం చేశారు.రక్తదానం చేసిన యువకులను,హుజురాబాద్ డిప్యూటీ డిఎంహెచ్ ఓ డాక్టర్ చందు,సైదాపూర్ మండల అరోగ్య కేంద్రం అధికారి డాక్టర్ సౌమ్య,ఏఎన్ఎం శారదలు పాల్గొనీ రక్తదాతలకు సర్టిఫికెట్లు అందజేశారు.

## శాంతియుతంగా పండుగలు నిర్వహించుకోవాలి ఎస్ ఐ శ్రీకాంత్



**మద్నూర్ /జూన్ 14(అక్షరం న్యూస్ –కామారెడ్డి ):** రాబోయే పండుగలు ఉమ్మడి మండలాల ప్రజలు శాంతియుతంగా సోదర భావం తో నిర్వహించుకోవాలని ఎస్ ఐ. శ్రీకాంత్ తెలిపారు. శుక్రవారం రోజున ఆయా పార్టీల నాయకులు, అన్ని వర్గాల వారితో శాంతి కమిటీ నిర్వహించడం జరిగింది. బక్రీద్ పండుగ సోదర భావం తో నిర్వహించుకోవాలని తెలిపారు. నిబంధనలు అనుసరించలాని కోరారు. అక్రమ రవాణా గోవులు తరలిస్తే వారి పై చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. ఈ శాంతి కమిటీ సమావేశంలో ఎస్. ఐ. శ్రీకాంత్, ఉమ్మడి మండలాల పశువైద్యులు, గ్రామ ప్రజలు, ఆయా పార్టీల నాయకులు పాల్గొన్నారు.

## నాటు సారా స్వాధీనం..

**- కేసు నమోదు చేసిన ఎస్ ఐ జీనత్ కుమార్**

**మహబూబాబాద్ /గార్ల /జూన్ 14/అక్షరం న్యూస్:**

మహబూబాబాద్ జిల్లా, గార్ల మండల పరిధిలోని బుద్ధారం తండా గ్రామంలో పోలీసులు పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా నమ్మదగిన సమాచారం మేరకు బుద్ధారం తండ గ్రామానికి చెందిన వాంకుడోత్ భారతి, మరియు వాంకుడోత్ తార తమ ఇంటి వద్ద ప్రభుత్వ నిషేధం లో ఉన్నటువంటి నాటు సారాయి, గుడుంబా బెల్లం పానకం కలిగి ఉండగా సిబ్బందితో కలిసి దాడి చేసి ఇద్దరి వద్దనుండి సుమారు 13 లీటర్ల నాటు సారాయి స్వాధీనం చేసుకోవడం జరిగిందని గార్ల ఎస్ ఐ ఎన్. జీనత్ కుమార్ తెలిపారు. 200 లీటర్ల బెల్లం పానకమును అక్కడే పారబోయడం జరిగిందని,వారిద్దరినీ అదుపులో తీసుకొని పోలీస్ కేసు నమోదు చేయడం జరిగిందని తెలిపారు.

## సౌత్ జోన్ ఉమెన్స్ ఉష లీగ్ పోటీల్లో పథకాలు సాధించిన మహిళలకు. ఘనంగా స్వాగతం



**జ్యోతి నగర్ జూన్ 14 పెద్దపల్లి జిల్లా అక్షరం న్యూస్:**

ఈనెల 10వ తేది నుండి 14 వ తేదీ వరకు కర్ణాటక బాగల్ కోర్టులో జరిగినటువంటి సౌత్ జోన్ ఖేలో ఇండియా ఉమెన్స్ వూషూ లీగ్ పోటీలలో రామగుండం వాసి వడ్డేపల్లి నవీన వూషూ సీనియర్స్ తైజిజియన్ టౌలు విభాగంలో సందా ఫైట్ –60కేజీ విభాగంలో శ్రవంజాలి బంగారు పతకం సాధించి వచ్చిన మహిళలకు ఎన్టిపిసి మెడికల్ సెంటర్లో శుక్రవారం రాత్రి ఘన స్వాగతం లభించింది. పథకాలు సాధించిన తిరిగి వచ్చినటువంటి క్రీడాకారులకు రామగుండంలో రామగుండం ఎంఎల్ఏ
సతిమని మానాలి ఠాకూర్ క్రీడాకారులను ఘనంగా స్వాగతం పలికి శాలువాతో పూలమాలతో సత్కరించడం జరిగింది. సౌత్ జోన్ నుంచి జాతీయస్థాయి పోటీలకు ఎంపికైన క్రీడాకారులను అభినందించారు.

# స్టేషన్ ఘనాపూర్ ఎమ్మెల్యే శ్రీహరిని కలసిన కోడూరు నాయకులు



**జనగామ జిల్లా/ రఘునాథపల్లి/( అక్షరం న్యూస్ ) జూన్ 14 :** స్టేషన్ఘన్పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరిని కోడూరు నాయకులు,గ్రామస్తులు మాజీ జెడ్పిటిసి మారుజోడు రాంబాబు ఆధ్వర్యంలో శుక్రవారం హనుమకొండలోని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలవడం జరిగింది. ఈ సందర్భంగా కోడూరు గ్రామస్తులు కడియం శ్రీహరికి పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం కోడూరు పెద్దవాగు నిర్మాణ పనులు చేపట్టాలని కోరారు. అదేవిదంగా కోడూరు నుండి చిటూర్ వరకు బీటీ రోడ్డును మంజూరు చేయాలని విన్న వించారు. దాంతో పాటుగా గబ్బేట నుండి కోతుల బాధ వరకు డబుల్ రోడ్డు మంజూరు చేయాలనీ కోరగా వెంటనే స్పందించిన కడియం శ్రీహరి పంచాయతీరాజ్ ఈఈ తో మాట్లాడి ఎస్టిమేషన్ వేయాలని చెప్పడం జరిగింది. ఎమ్మెల్యే కలిసిన వారిలో కోడూరు గ్రామ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు,గ్రామస్తులు పాల్గొన్నారు.

# గ్రామసభలో పలు సమస్యల వెల్లువ



**రాజన్న సిరిసిల్ల /ముస్తాబాద్ /జూన్ –14(అక్షరం న్యూస్ ):** ముస్తాబాద్ మేజర్ గ్రామ పంచాయతీ లో ప్రత్యేక అధికారి ఆధ్వర్యంలో నిర్వహించిన గ్రామసభలో ప్రజా సమస్యలు వెల్లువెత్తాయి. గ్రామ సభలో స్థానిక ఇందిరమ్మ కాలనీలోని చెత్తాచెదారము తో అపరిశుభ్రంగా ఉంటుందని గ్రామ సభ లో లేవనేత్తడంతో కాలనీలో చెత్త కుండీలను ఏర్పాటు చేయాలని సభలో తీర్మానించారు. ఇందిరమ్మ కాలనీలో అక్రమంగా ఎలాంటి అనుమతి ఇండ్ల పట్టాలు లేకుండా, ప్రభుత్వ అనుమతులు లేకుండా ఇల్లు నిర్మిస్తున్నారని వాటిపై చర్యలు తీసుకోవాలని మండల కో ఆప్షన్ షాదుల్ పాప సభ దృష్టికి తీసుకురాగా వాటిపై త్వరలోనే చర్యలు తీసుకుంటామని అక్రమ నిర్మాణాలను తొలగిస్తామని గ్రామ సభలో తీర్మానం చేశారు. నాలుగు సంవత్సరాల వయస్సు గల చిన్నారులు
ప్రైవేట్ పాఠశాలల కు వ వెళ్లడం వల్ల అంగన్వాడీలో పిల్లలు రావడం లేదని సభలో తెలిపారు దీనిపై 3 సంవత్సరాల పిల్లలను ప్రయివ్టే పాఠశాలలో అడ్మిషన్ చేసుకోవద్దని సభలో తీర్మానించారు . వానాకాలం తలపిస్తున్న సందర్భంగా సీజన్ వ్యాధులు వాటిల్లకుండా ముందస్తుగా జాగ్రత్తలు తీసుకోవాలని స్పెషల్ అధికారి తహసిల్దార్ సురేష్. అధికారులకు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ ప్రత్యేక అధికారి తహసీల్దార్ సురేష్. మండల నోడల్ అధికారి రాజిరెడ్డి. ప్రధానోపాధ్యాయులు రవీందర్,మండల ఆప్షన్ సభ్యుడు షాదుల్ పాప ఎంపీటీసీ కంచం మంజుల నర్సింలు. జూనియర్ అసిస్టెంట్ బిక్షపతి. అంగన్వాడి టీచర్లు ఏఎన్ఎంలు ఆశ వర్కర్ వివో లు తదితరులు పాల్గొన్నారు.

# అయ్యప్ప స్వామి గుడిలో ఘనంగా ఉత్తర నక్షత్ర పూజ మహోత్సవం




**రాజన్న సిరిసిల్ల /ముస్తాబాద్ /జూన్ –14(అక్షరం న్యూస్ ):**

శ్రీ స్వామి అయ్యప్ప జన్మదిన నక్షత్రమైన ఉత్తర నక్షత్రం పురస్కరించుకుని ముస్తాబాద్ మండల కేంద్రం లోని శ్రీ హరి హర పుత్ర అయ్యప్ప స్వామి ఆలయం లో శ్రీ శ్రీ శాంతి స్వరూపులు రాజు గురు స్వామి ఆధ్వర్యంలో గణపతి హెూమం, అయ్యప్ప స్వామికి పంచామృతా అభిషేకం, స్వామి వారికీ అలంకరణ, పుష్పర్చన,ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం వేద ఆశీర్వాదం, వచ్చిన భక్తులకు తీర్థ ప్రసాద వితరణ చేశారు. స్వామి వారి ఆలయాన్ని మామిడి తోరణాలతో పూల తో సుందరంగా అలకరించారు. మహిళ లు టెంకాయ లో నెయ్యి వేసి జ్యోతి వెలిగించి స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. సాయంత్రం 7గంటలకు పడి పూజ కార్యక్రమం నిర్వహించారు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అయ్యప్ప స్వామిని దర్శించుకున్నారు .అయ్యప్ప స్వామి అనుగ్రహంతో ప్రజలంతా సుఖ సంతోషాలతో ఉండాలని అన్నారు ఈ కార్యక్రమం లోఆలయ పూజారి శ్రీపాద శర్మ,మహిళలు, భక్తులు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.